'ఐక్యంగా ముందుకు సాగాలి'

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగుతూ అన్నిరంగాల్లో రాణించాలని ఆనంఘం జిల్లాఅధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పద్మశాలిభవన్‌లో ఏర్పాటుచేసిన పట్టణపాలక వర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వ హించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయ, ఆర్థిక,వ్యాపార,సామాజికరంగాల్లో రాణించాలన్నారు. ఐక్యంగా ఉంటేనే ఏదైనాసాధించవచ్చన్నారు. పద్మశాలీల సమస్యలపరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి సంజీవ్, నాయకులు లింగయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి: ఎస్పీ



చింతలమానేపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

చింతలమానేపల్లి/సిర్పూర్(టి), నవంబరు 6: ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ డీవీశ్రీనివాస రావు అన్నారు. చింతల మానేపల్లి, సిర్పూర్(టి) మండల కేంద్రాల్లోని పోలీసుస్టేషన్లను బుధ వారం ఆయన సందర్శిం చారు. ఈసందర్భంగా పోలీసుసిబ్బంది విధులగురించి ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్‌లో కేసులకు సంబంధించిన ఫైళ్లను, పోలీసుస్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజాఫిర్యాదులలో ఎటువంటి జాప్యంచేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. నేరదర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలని, రికార్డులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచా లన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో జిల్లాసరిహద్దు చెక్‌పోస్టులలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, సీఐ రమేష్, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులపై విచారణ షురూ



విచారణ అధికారికి ఫిర్యాదులు చేస్తున్న రైతులు

కాగజ్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అడవిపందిని చంపిన కేసులో బెంగాళీ క్యాంపునకు చెందిన పలువురిపై అటవీశాఖ అధికారులు తీరును నిరసిస్తూ ఎమ్మెల్యే హరీశ్‌బాబు నిరాహారదీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని రాష్ట్రవిజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్‌కి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో బుధవారం విచారణ బృందం ఈ ఘటనలో పాల్గొన్న అటవీ శాఖ అధికారులపై ఎంక్వైరీ ప్రారంభించింది.

విచారణలో రైతులు చేసిన ఫిర్యాదులు..

సిర్పూరు నియోజకవర్గంలోని పలువురు అటవీశాఖ అధికారులపై రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్‌కు పలువురు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల్లో ప్రధానంగా కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఒక్కొక్కరి దగ్గరి నుంచి డబ్బులు వసూలు చేశారని, ఇవ్వనివారిని కంకర రాళ్లు పోసి వాటిపై పడుకొబెట్టి కొట్టినట్టు భూపాలపట్నం గ్రామానికి చెందిన రైతులు రోదిస్తూ తెలిపారు. అలాగే తమ భర్తకు సంబంధం లేకున్నప్పటికీ కూడా అడవి పందిని చంపిన కేసులో అరెస్టు చేసి జైలుకు పంపించారని బెంగాళీ క్యాంపునకు చెందిన ఆపర్ణ ఫిర్యాదు చేసింది. లావుని పట్టాభూమిలో జేసీబీతో మట్టిని తవ్వితే జేసీబీని సీజ్‌చేశారని, వదిలేందుకు డబ్బులు డిమాండు చేశారని తెలిపారు. ఖర్జి రేంజ్ పరిధిలోని దిందా అటవీప్రాంతంలో పెద్ద మొత్తంలో చెట్లు నరికివేతకు గురైనట్టు ఫిర్యాదు చేశారు.

కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు, సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానంను వెంటనే రద్దు చేసి పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఈఎస్‌ఐ, రిటైర్‌మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీకర్, గంగారాం, నగేష్, రమేష్, పుష్పలత, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని..



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్: జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల 13నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు బ్రహ్మనందం మాట్లాడుతూ 13నెలలుగా వేతనాలుపెండింగ్‌లో ఉండడంతో కార్మికకుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌పాషా, తిరుపతి, కొమురయ్య, అన్వర్, రామన్న, లక్ష్మి, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు 6వేల పెన్షన్ ఇవ్వాలి

- ఈనెల 10నుంచి 16వ వరకు రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న పెద్దపల్లి సత్యనారాయణ

కాగజ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వెంటనే నూతన పెన్షన్ అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఇన్‌చార్జీ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికలసమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు రూ.6వేలకు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇంత వరకు పెంచలేదన్నారు. పోరుబాట పట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 10నుంచి కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన దీక్షలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలా కేంద్రాల్లో సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఈనెల 26న హైదరాబాద్‌లో వికలాంగుల ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశంలో నాయకులు చైతన్య వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ ఖయ్యూం, జలంపల్లి శ్రీనివాస్, బన్నామూర్తి, మాచర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

వాంకిడి/కెరమెరి/పెంచికలపేట/కౌటాల,నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలాల్లోని ఆశ్రమపాఠశాలలను బుధవారం మండల అధికారులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనస్థాయి, హాస్టల్‌లో అందిస్తున్న భోజనవివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, శౌచాలయాలను పరిశీలించారు. మెనూ పాటించని ఆశ్రమ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తరగతుల నిర్వహణ, హాజరుపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల వివరాలు, వారి ప్రతిభను పరిశీలించారు. చదవడం, రాయడంలో వెనకబడి ఉన్న వారిని గుర్తించి ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు.

ఉ(ఎ)త్తి పోతలు

- జిల్లాలో నిరుపయోగంగా సాగునీటి పథకాలు
- ఎత్తిపోతలకు మరమ్మతులు కరువు
- పంటపొలాలకు అందని నీరు



అలంకార ప్రాయంగా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల పథకం

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంటలకు సాగు నీరందించే ఉద్దేశంతో జిల్లాలో ప్రాణహిత, పెన్‌గంగా నదుల వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకాలు ఆయకట్టుకు చుక్క నీరందించడం లేదు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన ఈ పథకాలు అన్నదాతలకు రిక్తహస్తాన్ని చూపుతున్నాయి. కొన్ని ఎత్తిపోతల పథకాల పనులు ఏళ్ల తరబడి కొనసాగుతుండగా మరి కొన్ని మరమ్మతులకు నోచుకోక



నిరూపయోగంగా కోర్సిని ఎత్తి పోతల పథకం

మూలకుచేరాయి. దీంతో రైతులు ఏటా నష్టాలను మూటగట్టుకుంటున్నారు. జీవనదిని తలపించే ప్రాణహిత, పెన్‌గంగపై కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూరు(టి) మండలాల్లో తొమ్మిది ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. కౌటాల మండలంలో సాండ్ గాం, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామా ల్లో ఎత్తిపోతల పథకాలుండగా ఏఒక్క పథకం కూడా పనిచేయడం లేదు. చింతలమానేపల్లి మండలంలోని కోర్సిని, గూడెం, రన్‌వెల్లి ఎత్తిపోతల పథకాలు పూర్తి కాక నిరూపయోగంగా మారాయి.

● అలంకారప్రాయంగా పథకాలు..

కౌటాల మండలంలో 10 వేల ఎకరాలకు ప్రాణహితజలాలను పంటపొలాలకు అందించేందుకు రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో పదేళ్లకిందట తు మ్మిడి హెట్టి, వీర్దండి, గుండాయిపేట, సాండ్‌గాం ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఇవి కొన్నిరోజుల పాటు ఆయకట్టు పొలాలకు నీరందించినప్పటికీ మోటార్లు చెడిపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. దీంతో అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. చింతల మానేపల్లి మండలం ఎనిమిది వేల ఎకరాల సాగుకు నీరందించే లక్ష్యంతో కోర్సిని వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు ఎనిమిదేళ్లగా నత్తనడకన కొనసాగుతున్నాయి. రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ పథకం నేటికీ పూర్తికాలేదు. గూడెం, రనవెల్లి ఎత్తిపోత పథకాలు సైతం నేటికి పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి ఉపయోగంలోకి తీసుకరావాలని ఆయకట్టు దారులు కోరుతున్నారు.

● ఆయకట్టుదారుల్లో ఆందోళన..

జిల్లాలో ఎత్తిపోతల పథకాల కింద భూములను సాగుచేస్తున్న ఆయకట్టుదారుల్లో ఆందోళన నెలకొంది. ఏళ్ల తరబడి ఎత్తిపోతల పథకాలు పూర్తి కాకపోవడంతో పంటపొలాలకు చుక్కనీరందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లు వెచ్చించి పథకాలు ప్రారంభించినా అవి పూర్తి కాకపోవటంతో వర్షాధారంపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. అంగట్లో అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ఆయకట్టుదారుల పరిస్థితి. పుష్కలంగా జలవనరులున్నా ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలు పూర్తికాక, పూర్తి అయినా మరమ్మతులు నోచుకోక ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తుండటంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపడితే ఈ ప్రాంత రైతులు రెండు పంటలు పండించే అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న రాష్ట్ర కమిషన్ సభ్యులు

వాంకిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గిరిజనఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి పేర్కొన్నారు. బుధవారం వారు గిరిజన ఆశ్రమపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుసున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన, మంచినీటి వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం చేస్తున్న వంటకాలను పరిశీలించారు. వంటశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని వంటసామాగ్రిని శుభ్రంగా కడిగి వంటకాలు చేయాలన్నారు. విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై వాకబు చేశారు. విద్యార్థి నులకు మెరుగైనవైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులను పరామర్శించిన రాష్ట్ర కమిషన్ సభ్యులు..

ఆసిఫాబాద్‌రూరల్: వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమబాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై జిల్లాకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు త్రిష, సాయికీర్తనను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలదేవి బుధ వారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితిని వైద్యుడు ప్రసాద్‌ను అడిగితెలుసుకొని మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. ఆశ్రమపాఠశాలలో సంఘటనపై విచారణ జరిపించి సరైన న్యాయం అందేలా చూస్తామని తెలి పారు.

కోలుకుంటున్న విద్యార్థినులు..

వాంకిడి: ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యానికి గురైన విద్యార్థినులు కోలుకుంటున్నారు. మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన విద్యార్థినులు కోలుకోవడంతో వారిని డిశ్చార్జీ చేసి పాఠశాలకు తరలించారు. ఆశ్రమపాఠశాలలో ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలుచేస్తూ వైద్యం అందిస్తున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురువిద్యార్థినుల్లో ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉండగా శైలజ అనే విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. అయితేశైలజకు నిమ్స్‌వైద్యులు మెరుగైనవైద్యం అందిస్తున్నారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జీసీడీవో శకుంతల తెలిపారు. పాఠశాలలోవిద్యార్థినుల అనారోగ్యానికి కారణాలు ఇంకాతెలియరాలేదు. విద్యార్థినులు గత 30వతేదీనవాంతులు, విరేచనాలతోఅస్వస్థతకు గురికావడంతో వంటకుసంబంధించిన సరుకులు,నీటి శాంపుల్స్‌ను పరీక్షలకు పంపించారు.

సెపక్ తక్రా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా భాస్కర్



భాస్కర్

రెబ్బెన, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా భాస్కర్ నియమితులైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీఎల్ నరసింహ బుధవారం ప్రకటించారు.ఆయన 2024-28 వరకు కొనసాగుతారని తెలిపారు. ప్రస్తుతం ఆయన రెబ్బెన మండలం గోలేటి సింగరేణి పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం రాష్ట్రప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, నాయకులు, అధికారులు, సంఘాల ప్రతినిధులు అభినందించారు.

'కుమ్మర కులం పేరు రాయించుకోవాలి'

రెబ్బెన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణనకు వస్తున్న అధికారులు, సిబ్బందికి కుమ్మర కులస్థులు తప్పకుండా కులం పేరులో కుమ్మరగా రాయించుకోవాలని జిల్లా కుమ్మరసంఘం అధ్యక్షుడు మల్లేష్ తెలిపారు. ప్రభుత్వ గెజిట్‌లో ఉన్న కులానికి సంబంధించిన కాలంలో కుమ్మర కులం, వృత్తి అనే వాటిలో కుమ్మరవృత్తి అని తప్పకుండా రాయించుకోవాని సూచించారు. దీని ద్వారా కుమ్మరి కులస్థులు ఎంత మంది ఉన్నారే అంశం తేలుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల కస్తుర్బాగాంధీబాలికల విద్యాలయంలో ఖాళీగాఉన్న బోధనేతరసిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్ల ఎంఈవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో అసిస్టెంట్‌కుక్ 1, స్వీపర్1, పోస్టులుఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను నవంబరు7నుంచి12వ తేది సాయంత్రం 4గంటల వరకు ఎమ్మార్సీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్



బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలికల విద్య,ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్‌తోకలిసి జిల్లామహిళా, శిశుసంక్షేమ శాఖఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ బాలికలదినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు తమఆరోగ్యంపై శ్రద్ధవహించాలని, ఏకాగ్రాగతతో కష్టపడిచదివి ఉన్నతస్థానాన్ని చేరుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంక్షేమంలో భాగంగా విద్యవైద్యంవంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికలసంక్షేమం కోసం కృషిచేస్తామన్నారు. బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 32బాలికల ఆశ్రమపాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు నిర్వహించినపోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానంచేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జీసీడీవోశకుంతల,పీఏసీఎస్‌చైర్మన్ అలీబీన్ అహ్మద్, సీడీపీవోలు,సూపర్‌వైజర్లు,తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి/దహెగాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టీజీబ్యాంకు కల్పిస్తున్న బీమాసౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కృష్ణ అన్నారు. మండలకేంద్రానికి చెందిన జాడిరేఖఇటీవల మృతి చెందగా ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద బ్యాంకునుంచి రూ.2లక్షలు మంజూరయినట్లు తెలిపారు. ఈ మేరకు నామినీగా ఉన్న మృతురాలి భర్త రమేష్‌కు బీమా చెక్కును అందజేశారు.

దహెగాం: బీమాపథకాలను ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌ఎల్‌సీ అంజన్న అన్నారు. బుధవారం మండలకేంద్రంలో జనసురక్ష కార్యక్రమంలో భాగంగా బీమాపథకాలపై అవగాహన కల్పించారు.

17 నుంచి జాతీయ స్థాయి కరాటే పోటీలు

సిర్పూర్(టి), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న కాగజ్‌నగర్‌లోని పటేల్‌గార్డెన్స్‌లో జాతీయస్థాయి కరాటేపోటీలు నిర్వహిస్తున్నట్లు డ్రాగెన్‌మార్షల్‌ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఒకప్రకటనలో తెలిపారు. ఈపోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు.

సీఐని కలిసిన నాయకులు

రెబ్బెన, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రెబ్బెన సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బుద్ధెస్వామిని బుధవారం కాంగ్రెస్‌నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రావు, శ్రీనివాస్, వెంకటేష్, రమేష్, మధునయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా కె సీతారాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయంలోని అన్నివిభాగాల అధికారులు, వైద్య ఆరోగ్యసిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చెస్, కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శపాఠశాల, కళాశాల విద్యార్థిని దుర్గం విద్య జోనల్‌స్థాయి చెస్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అదే విధంగా బొట్టుపల్లి సాయిదీక్ష రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తృతీయస్థానం సాధించడంతో బుధవారం వీరిద్దరిని ప్రిన్సిపాల్ మహేశ్వర్, పీఈటీ తిరుపతి సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మయూరి పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జాడె అతుల్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో ఆయన జిల్లాజట్టుకు ప్రాతినిధ్యం వహించాడన్నారు. అలాగే జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న బన్నీత్ సైతం ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నారాయణ, పీడీ హరికృష్ణ తెలిపారు. వీరు ఈనెల 7నుంచి 9వరకు యాదాద్రి భువన గిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



విద్యార్థులను పరామర్శిస్తున్న వెంకటేష్ దోత్రే

వాంకిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం రాత్రి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి మంచిర్యాల జిల్లాకేంద్రంలోని మ్యాక్స్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థునులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి క్షేమంగా ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముగ్గురు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన సర్వే



ఆసిఫాబాద్‌లో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూరు/రెబ్బెన/వాంకిడి/కెరమెరి/దహెగాం/లింగాపూర్/పెంచికలపేట/చింతలమానేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు అన్నారు. బుధవారం మండలాల్లోని ఆయా గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వేను పకడ్బందీగా చేయలన్నారు. నిర్దేశించిన అంశాల్లో ప్రతిదానిని లోతుగా పరిశీలించి ప్రభుత్వలక్ష్యాన్ని నేరవేర్చాలని సూచించారు. సర్వేలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా మండలంలోని ఇతర గ్రామపంచాయతీల్లో సైతం ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు.

న్యూస్ బాక్స్

చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలను జార విడుస్తున్న మత్స్యశాఖాధికారి

బెజ్జూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లబాయి చెరువులో మత్స్యశాఖాధికారి మధుకర్, నరేష్, రామ రాజు బుధవారం చేపపిల్లలను జారవిడిచారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందా లన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి తుకారాం, ఇస్తారి, బాలయ్య, బుచ్చయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న డీఆర్డీవో దత్తరాం

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలో సీసీలుగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన తిరుమల్, అరుణ్‌కుమార్ కుటుంబసభ్యులకు బుధవారం ఎక్స్‌గ్రేషియా చెక్కులను డీఆర్డీవో దత్తరాం అందజేశారు. ఒక్కొక్కరికి స్త్రీనిధిద్వారా మంజూరైన రూ.1.50 లక్షల చెక్కులను అందజేశారు. అంతకు ముందు సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు లోన్‌బీమా, ప్రమాదబీమాపై సెర్ప్ సిబ్బందికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒరియంటేషన్ ప్రోగాం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపుడీఆర్డీవో రామకృష్ణ, జోనల్‌మేనేజర్ రవికుమార్, ఆర్‌ఎం శ్రీనివాస్, అన్నాజీ, డీపీఎంలు యశోద, యాదగిరి, సారయ్య, ఏపీఎంలు రాజ్‌కుమార్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల




పోస్టర్లను విడుదల చేస్తున్న టీయూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల10,11తేదీల్లో నిర్వహించే టీయూటీఎఫ్ రాష్ట్ర విద్య మహాసభ పోస్టర్లను బుధవారం జిల్లా నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతోపాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ మహాసభలను నిర్వహిస్తున్నామని జిల్లానుంచి సంఘబాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సదాశివ్, సభ్యులు వెంకట్‌రావు, ప్రకాష్, ధన్‌రాజ్, జలపత్‌రావు, శ్రీనివాస్, రమేష్, విద్యాసాగర్, సుభాష్, కృష్ణమూర్తి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ డబ్బుల కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వాలు మారుతున్న తప్పని నిరీక్షణ
- దయనీయ స్థితిలో సర్‌సిల్క్ కార్మికులు



కాగజ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని మూతబడిన సర్‌సిల్క్ మిల్లు కార్మికులు గ్రాట్యుటీ కోసం ఎదురు చూస్తున్నారు. 1948లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా బిర్లా యాజమాన్యం సర్‌సిల్క్ మిల్లును ఏర్పాటు చేసింది. దాంతో ఈ ప్రాంతం క్రమేణా అభివృద్ధి చెందింది. ఏర్పాటైన ఏడాదిలోనే బిర్లా యాజ మాన్యా నికి, ట్రేడ్ యూని యన్లకు మధ్య అగ్రిమెంటు వివాదం ఏర్పడింది. అగ్రిమెంటు రూ.450 పెంచాలని డిమాండుతో అప్పటి కార్మిక ట్రేడ్‌యూనియన్ సంఘం పట్టు బట్ట డం, బిర్లా యాజ మాన్యం మెట్టుదిగక మూసి వేసింది. కార్మికులు దశల వారీగా పోరా టం చేసిన తర్వాత ప్రయి వేటు యాజ మాన్యాల పెట్టు బడులు, ఐడీబీఐ బ్యాంకర్ల సహకారంతో తిరిగి 1994లో మిల్లును పునఃప్రారంభించారు. మార్కెట్‌లో పోటీ పెరగటంతో ఈ మిల్లు నుంచి ఉత్పత్తి అయ్యే సిల్క్‌బట్టలకు డిమాండు ధర లేక 2001న శాశ్వతంగా మూసివేశారు. తమకు రావాల్సిన జీత భత్యాలు, గ్రాట్యుటీ ఇతర బకాయిలు చెల్లించాలని హైకోర్టులో 2001లో కార్మికులు కేసువేశారు.

హై కోర్టు ప్రత్యేకంగా లిక్విడేటర్‌ను నియమించి మిల్లు ఆస్తులను అమ్మి చెల్లించాలని ఆదేశించింది. ఈ దిశగా తొలిదఫాలో కార్మికులకు 2008లో మిల్లు ఆస్తులను రూ.18.5కోట్లకు ఓపెన్ టెండర్ ద్వారా అమ్మి కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు తొలిదఫా చెల్లించారు. ఇంకా రెండో దఫా రూ.13కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం కార్మికులు నిరీక్షిస్తున్నారు. వీటితో పాటు కేంద్రం ప్రకటించిన టెక్స్‌టైల్ వర్కర్స్ రిహ్యాబిటేషన్ ప్యాకేజీ కింద 18నెలల వేతనం వచ్చే అవకాశాలున్నప్పటికీ ఈ ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. మిల్లు మూత బడే సమయంలో 1000 మంది పర్మినెంటు కార్మికులు, 500మంది స్టాఫ్ ఉద్యోగులు, 1000మంది డైలీ వేజ్ కార్మికులు పనిచేసేవారు. ఇందులో కొంతమంది చనిపోగా, మరికొంత మంది ఇతర పట్టణాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం కార్మికులు పూర్తిగా వయస్సుమీద పడి ఉన్నారు.



సర్‌సిల్క్ మిల్లు గేటు

2008 నుంచి వీరంతా డబ్బుల కోసం ఎదురు చూస్తుండగా ఇప్పటికీ ఓ కొలిక్కి రావడం లేదు. మిల్లు స్థలాలు అమ్మేందుకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఖాళీ స్థలాలపై కొంతమంది కన్నేసి కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు నోటీసులిస్తున్నప్పటికీ ఆక్రమణలు ఆగడం లేదు. దీంతో కార్మికులు హైరానా పడుతున్నారు. మిల్లు స్థలం కళ్లెదుటే పోతుండటంతో తమకు పెండింగ్ బకాయిలు ఎలా వస్తాయని దిగులు పడుతున్నారు.

ఇంత వరకు చెల్లించలేదు..
:నర్సయ్య, కాగజ్‌నగర్



సర్‌సిల్క్ మిల్లు కార్మికులు బకాయిల విషయం ఇంకా క్లియర్ కాలేదు. పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ బకాయిలు త్వరితగతిన ఇప్పించాలి. ఈ విషయంలో అధికారులు, నాయకులు ప్రత్యేకదృష్టి సారించాలి. అలాగే టెక్స్‌టైల్ వర్కర్స్ రిహాబిటేషన్ ప్యాకేజీ కింద 18నెలల జీతం వస్తదని ఎదురు చూస్తున్నారు. కానీ అదీ కూడా రాలేదు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటే తప్పా ఈ సమస్యకు పరిష్కారం లభించదు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ రవీందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంతఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సైబర్‌నేరాలపై అవగాహనకార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంతఉద్యోగులసంఘం నాయకులు కరుణాగౌడ్, ఎస్సై రాజేశ్వర్ పాల్గొన్నారు.

వాంకిడి/పెంచికలపేట: మండలకేంద్రాల్లో ఏఎస్సై పోశెట్టి, ఎస్సై కొమురయ్య సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్‌వివరాలు అపరిచితులకు తెలుపవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930టోల్‌ఫ్రీ నెంబరు డయల్ చేయాలన్నారు.



ఆసిఫాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల ధర్నా



పడుకొని నిరసన తెలుపుతున్న మాలన్‌గోంది గ్రామస్థులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలన్‌గోంది గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌తీరును నిరసిస్తూ బుధవారం మాజీసర్పంచ్ తిరుపతి, గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పడుకొని వినూత్నరీతిలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం బైఠాయించి ధర్నాచేశారు. గ్రామస్థుల ఆందోళనకు పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్‌అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జాబరి రవీందర్ మద్దతుపలికారు. ఈ సందర్భంగా మాజీసర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు ఇవ్వడంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామపంచాయతీలో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. గ్రామంలో పారిశుధ్యంలోపించినా పట్టించుకోవడంలేదన్నారు. విషయంతెలుసుకున్న పంచాయతీకార్యదర్శి ప్రసాద్ అక్కడివచ్చి మాజీసర్పంచ్‌కు తీర్మానప్రతులను అందజేయడంతో ఆందోళన విరమించారు.

సర్వే వివరాలను స్పష్టంగా నమోదు చేయాలి


కాగజ్‌నగర్/సిర్పూర్(టి), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమగ్రసర్వేలో కుటుంబసభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారంపట్టణంలో, సిర్పూర్(టి)లో సిబ్బంది చేస్తున్న సర్వేతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఇంటింటికి స్టిక్కర్ అంటించడంలో ఒక్కఇల్లు కూడా తప్పిపోవద్దన్నారు. తప్పిపోతే ఎన్యుమరేటర్లే బాధ్యత వహించాలన్నారు. సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ సర్వేలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఇండ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమునాలో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన..

సిర్పూర్(టి): ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్న నేపథ్యంలో సిర్పూర్(టి)లో కొనుగోలు కేంద్రం గదులను పరిశీలించారు. అదే విధంగా సరిహద్దులోని హుడ్కిలి, వెంకట్రావుపేట అంతరాష్ట్ర చెక్‌పోస్టులను సందర్శించారు. మహారాష్ట్ర నుంచి ధాన్యంరాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ వస్తే వాహనాలను, ధాన్యాన్ని సీజ్‌చేసి తహసీల్దార్‌కు బైండోవర్ చేయాలన్నారు. ఆయనవెంట సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా,తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



కాగజ్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కోల్ ఇండియా పోటీల్లో విజేతగా నిలవాలి

మందమర్రి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా ఫుట్‌బాల్ పోటీల్లో ఈసారి తప్పకుండా విజేతలుగా నిలవాలని మందమర్రి ఏరియా పీఎం శ్యాంసుందర్ తెలిపారు. బుధవారం సింగరేణి పాఠశాల మైదానంలో కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొదటిరోజు పోటీల్లో ఆయాజట్ల క్రీడాకారులు అద్భుతంగా ఆటతీరును ప్రదర్శించారని తెలిపారు.

విజేత శ్రీరాంపూర్ జట్టు: కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో జీడీకే, శ్రీరాంపూర్ జట్టు తలపడగా శ్రీరాంపూర్ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేష్, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా క్రీడల కార్యదర్శి కార్తీక్, ఆయాఏరియాల స్పోర్ట్స్ సూపర్వైజర్లు జాన్‌వెస్లీ, అశోక్, రమేష్, శ్రీనివాస్, శివకృష్ణ, నరేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, అన్ని ఏరియాల క్రీడాకారులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఎంకే4 మ్యాగ్జిన్‌ను పరిశీలించిన డీఐజీ



రెబ్బెన: మొక్కను నాటుతున్న సీఐఎస్‌ఎఫ్ అధికారి అపరాజిత

శ్రీరాంపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎంకే4 మ్యాగ్జిన్‌ను సౌత్‌జోన్-2(హైదరాబాద్) సీఐఎస్‌ఎఫ్ డీఐజీ అపరాజితా మహాపాత్ర బుధవారం పరిశీలించారు. మ్యాగ్జిన్‌లో ఉన్న డిటోనేటర్స్ గురించి వాకబు చేశారు. ఎంత నిల్వ ఉందో అడిగారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సెక్యూరిటీ సిబ్బంది తీసుకునే రక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం మొక్కను నాటారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్య నారాయణ, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ యోగేష్ పార్మర్, డిప్యూటీ, అసిస్టెంట్ కమాండెంట్లు పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటిలో సీఐఎస్‌ఎఫ్ పహరాలో నిర్వహిస్తున్న సింగరేణి ఎక్స్‌ప్లోసివ్ నిల్వకేంద్రం(మాగ్జిన్)ను బుధవారం సీఐఎస్‌ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సౌత్‌జోన్ అధికారి అపరాజిత సందర్శించారు. ఏరియాలో గనులు, శాంతిభద్రతపై జీఎం శ్రీనివాస్‌తో చర్చించారు. సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది వసతి, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో పీవో ఎం నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం(స్పోర్ట్స్) శ్రీనివాస రావు, రెబ్బెన సీఐ బుద్ధె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేకే ఓసీపీ లారీలను అడ్డుకున్న స్థానికులు

కాసిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్యాణి ఖని మెగా ఓసీపీలు లారీలు అధికలోడుతో వెళ్తూ అంతర్గత రోడ్లను ధ్వంసం చేస్తున్నాయని ఆరోపిస్తూ బుధవారం లారీలను అడ్డుకుని స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకుడు సిద్దం తిరుపతి మాట్లాడుతూ కొంతకాలంగా కేకే ఓసీపీలోని మట్టిని బయట వ్యక్తులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. లారీలను కాసిపేట గ్రామం నుంచి అధిక లోడుతో వెళ్తుండడంతో రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కేకే ఓసీపీ ప్రభావిత గ్రామాల్లో రోడ్లకు మరమ్మతులు చేపడతామని చెప్పి ఇంతవరకు చేపట్టలేదన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జీఎం కార్యాలయం ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చందాలు వసూలు చేయడం సరికాదు

మందమర్రిటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల వేతనాల నుంచి గుడి కమిటీ పేరిట రూ. 500 గుర్తింపు సంఘం వసూలు చేయించడం సరికాదని, దీన్ని వ్యతిరేకిస్తున్నామని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టులో చందాలను వసూలు చేశారన్నారు. దీనిపై కార్మికుల నుంచి వ్యతిరేక వచ్చిందన్నారు. కార్మికుల అనుమతి పొంది తీసుకోవాలని సూచించారు. దీనిపై యాజమాన్యంతో మాట్లాడుతామని తెలిపారు.

సైబర్ నేరాలపై ఉద్యోగులకు అవగాహన

రెబ్బెన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై బుధవారం బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు ఎవరికీ చెప్పరాదన్నారు. అలాగే వివిధ సైట్‌లకు సంబంధించిన లింక్‌లను కూడా ఓపెన్ చేయరాదని సూచించారు. సీఐ బుద్ధె స్వామి మాట్లాడుతూ ఇళ్లలో జరిగే చోరీల కంటే సైబర్ నేరాల ద్వారా ప్రజలు ఎక్కువ సొమ్మును పోగొట్టుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ఏరియాసెక్యూరిటి అధికారి ఉమాకాంత్, డీజీఎం(ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ ఆర్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడి మృతదేహం లభ్యం

బెల్లంపల్లిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోచమ్మ చెరువులో బుధవారం టేకులబస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు పులి రాజ్‌కుమార్ (55) మృతదేహం లభ్యమైంది. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన జాలర్లకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో పోలీసులు

జైపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం ఇందారం బ్రిడ్జి వద్ద పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామం నుంచి బొలేరో వాహనంలో మహారాష్ట్రకు అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఇందారం బ్రిడ్జి వద్ద పట్టుకున్నామని తెలిపారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితులు రాంచందర్, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

మంచిర్యాలలో...

మంచిర్యాల అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఐబీ చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఏపీ 15 ఎక్స్ 2563 నెంబర్ గల ఆటోలో ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన టి.దర్శన్ ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నా మన్నారు. తదుపరి విచారణ నిమిత్తం మంచిర్యాల పోలీసు లకు అప్పగించగా పట్టణ ఎస్సై ప్రవీణకుమార్ కేసు నమోదు చేశారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

మంచిర్యాల అర్బన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గద్దరాగడికి చెందిన రాఘవేందర్ పర్స్ పోగొట్టుకోగా ట్రాఫిక్ పోలీసులు తిరిగి అప్పగించారు. రాఘవేందర్ పని నిమిత్తం బుధవారం మంచిర్యాలకు వచ్చాడు. బస్టాండ్ ప్రాంతంలో పర్సును పోగొ ట్టుకున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్ పర్సును గమనించి రాఘవేందర్‌కు సమాచా రం అందించారు. ట్రాఫిక్ ఏఎస్సై నందగోపాల్ ఆధ్వర్యంలో పర్సును తిరిగి అప్పగించారు. కానిస్టేబుల్ సురేష్‌ను ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

యువకుల బైండోవర్

జన్నారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కిష్టాపూర్ గ్రామానికి చెందిన వాసాల నరేష్, గట్టు మహేష్, ఒడిపెల్లి రాజేష్ లను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసి నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపులో దూషిస్తూ రెచ్చగొట్టేలా వాయిస్ మెసెజ్‌లు పెట్టడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా బైండోవర్ చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా లో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పేకాటరాయుళ్ళ అరెస్ట్

నస్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సుందరయ్య కాలనీలో ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం పట్టుకున్నామని ఎస్సై సుగుణాకర్ తెలిపారు. చింతల నరేష్ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడం తో దాడి చేసినట్లు తెలిపారు. చింతల నరేష్, సిరిగిరి దశరథం, మౌటం జనార్ధన్, సిరిగిరి రమేష్, మౌటం రాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.2500 నగదుతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

సైబర్ మోసాలపై కేసులు నమోదు

నస్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ అశోక్ బుధవారం తెలిపారు. రాంనగర్‌కు చెందిన ఆడెపు శివ కుమార్ ఇన్‌స్ట్రాగ్రాంలో పార్ట్ టైం ఉద్యోగ ప్రకటన వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్ చాట్ చేసి వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతాయని నమ్మించారు. సెప్టెంబరు 21 నుంచి దశల వారీగా రూ.1,57,319లను పంపించాడు. అనంతరం వారి నుంచి సమాచారం రాకపోవడంతో మోసం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. సీతారాంపల్లికి చెందిన బొల్లం భీమయ్య పది వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు వస్తుందని చెప్పడంతో అక్టోబ రు 10 నుంచి రూ.67 వేలను దశల వారీగా పంపారు. వారి నుంచి స్పందన రాకపోవడంతో భీమయ్య ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

ఇసుక డంప్‌ల సీజ్

దహెగాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెండు ఇసుక డంపులను బుధవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. ఇసుక డంపులు చిలువేరు కమలాకర్‌కు సంబంధించినవిగా గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. దహెగాం గ్రామస్థులు జునగరి గణేష్, దేవేందర్, మహేష్ జిల్లా మైనింగ్ ఏడీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇసుక డంప్‌లను నిల్వ చేసిన ప్రదేశాన్ని గురించి స్వాధీనపర్చుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నివేదికలను జిల్లా మైనింగ్ అధి కారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఎంఆర్ఐ నాందేవ్, శృతి, ఎంసీ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందారంలో కలెక్టర్ పర్యటన



ఇందారంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

జైపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇందారం గ్రామంలో బుధవారం కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీచేశారు. సిబ్బంది హాజరు పనితీరును తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని సందర్శించి బ్యాగుల ఫిల్లింగ్ చేయాలని కార్యదర్శి సుమన్‌కు సూచించారు. శ్మశాన వాటిక, సెగ్రిగే షన్ షెడ్లులను తనిఖీ చేసి తడి, పొడిచెత్త నిర్వహణ, రిజిస్టర్‌లను మెయింటెన్ చేయాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అన్ని గ్రామాల్లో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మిట్టపల్లిలో నర్సరీ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీవో శ్రీపతిబాపు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.



ఆకట్టుకుంటున్న 'ప్రకృతి మిత్ర'

● ఇంటి ఆవరణలో పలు రకాల పూల మొక్కలు ● మిద్దెపై కూరగాయల సాగు

నస్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటినే ఒక పూల తోటగా మార్చాడు టీఎన్జీవో కాలనీలో గుండేటి అరుణ- యోగేశ్వర్‌లు. రకరకాల పూల మొక్కలు, షో మొక్కలతో ఇంటి పరిసరాలను తీర్చిదిద్దారు. సీతాకోక చిలుకలు, వివిధ పక్షులకు ఆవాసంగా మార్చారు. ఇంటి ఆవరణను పచ్చని వనంతో తీర్చిదిద్ది 'ప్రకృతి మిత్ర' అని పేరు పెట్టారు.

ఎన్నెన్నో రకాల మొక్కలు...

ఇంటి ఆవరణలో వివిధ రకాల పూలు, ఔషధ మొక్కలు, అందమైన మొక్కలు బోన్సాయ్ జాతులు, వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన అరుదైన మొక్క, తీగ జాతులున్నాయి. క్రోటాన్సు, మనీ ప్లాంట్, క్రిషర్స్, సీజనల్ ప్లాంట్స్, ఇంటి అందాన్ని పెంచే సైకాస్, పాస్టర్ సాంగ్స్, రాయల్ పామ్స్, పండ్ల మొక్కలు కనువిందు చేస్తున్నాయి. మెట్ల వద్ద, ఇంటిలోని కబోర్డులు ఖాళీ స్థలాల్లో తొట్టిల్లో పూల, తీగ జాతి మొక్కలున్నాయి.

మిద్దెలపై కూరగాయాలు...

మిద్దెలపై తొట్టిల్లో, ఖాళీ స్థలంలో టమాట, బీర, కాకర, సోరకాయ విత్తనాలు నాటుతున్నారు. క్రిమిసంహారక మందుల వినియోగం లేకుండా తాజా కూరగాయాలను మిద్దెలపై పండిస్తున్నారు. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుందని చెబుతున్నారు.









ఇంటి ఆవరణలో రకరకాల పూల మొక్కలు

ప్రజలకు అవగాహన కల్పించాలి: గుండేటి యోగేశ్వర్

ఇంటి పరిసరాలల్లో పచ్చదనం పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇంటిని ప్లాస్టిక్ కుప్ప తొట్టిగా కాకుండా అందమైన పూల, షో మొక్కలతో నిండి ఉంటే ఆహ్లాదకరంగా మార్చాం. ఇంటి వద్ద ఖాళీ స్థలంలో రకరకాల మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశాం. మిద్దెపై కూరగాయాల మొక్కలను నాటడంతో రోజు తాజా కూరగాయలను వాడుతున్నాం.



న్యూస్ బాక్స్

అతిథి అధ్యాపకులకు వెయిటేజ్ ఇవ్వాలి

గర్మిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన లెక్చరర్ నోటిఫికేషన్‌లో అతిథి అధ్యాపకులుగా పని చేసిన వారికి వెయిటేజి ఇవ్వాలని బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అతిథి అధ్యాపకుడు నవీన్ ఒక ప్రక టనలో తెలిపారు. వర్కింగ్ అనుభవం ఉంటే 20 మార్కులు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదన్నారు. ఇటీవల విడుదల చేసిన ల్యాబ్ టెక్నిషియన్ నోటిఫికేషన్‌లో అనుభవం ఉన్న వారికి 20 శాతం వెయిటేజీ మార్కులు ఇచ్చారని తెలిపారు. ఇలా వ్యత్యాసం చూపడం సరైంది కాదని, అతిథి అధ్యాపకుల పనిచేసిన కాలానికి వెయిటేజీ మార్కులు ఇవ్వాలని కోరారు.

కుల గణనపై శిక్షణ

బెల్లంపల్లిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండల పరి షత్ కార్యాలయంలో కుల గణనపై బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ మాట్లా డుతూ 69 మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు నియమించా మన్నారు. మండలంలో 9040 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటిలో వివరాలను నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీ డీవో మహేందర్ పాల్గొన్నారు.

సర్వేలో కార్యదర్శులదే ముఖ్య పాత్ర

గర్మిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో పంచాయతీ కార్యదర్శులదే ముఖ్య పాత్ర అని కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షుడు శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యూమరేటర్‌గా విధులు నిర్వహిస్తూనే మిగితా ఎన్యూమరేటర్లకు గ్రామ పరిస్థితులపై సమగ్ర సమాచారం అందిస్తూ పంచాయతీ కార్యదర్శులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. సర్వేను విజయవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు.

సన్మానం

తాండూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన మండల విద్యాధికారి ప్రభాకర్‌ను బుధవారం సురభి ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. ఇక్కడకు వచ్చిన విద్యాధికారి మల్లేశంకు స్వాగతం పలికారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్..

(5వ పేజీ తరువాయి..)

అమలు చేస్తున్నారు. ఇందులో నూతన కార్మికుల నమోదు, రెన్యూవల్, వివిధ రకాల పథకాల కింద పరిహారం, ప్రోత్సా హకాలను అందజేస్తున్నారు. రెండు నెలలుగా ఈ పోర్టల్ ఓపెన్ చేస్తే సర్వర్ ఈజ్ డౌన్ ప్లీజ్ చెక్ బ్యాక్ లేటర్ అంటూ సందేహాన్ని చూపుతోంది. కార్మికుల నివేదికలు, ఇతర సమా చారం సైతం అందు బాటులో లేదు. దీంతో ఈ మధ్యకాలంలో మృతి చెందిన, ప్రమా దాలకు గురైన వారు, ప్రసూతి అయిన మహిళా కార్మికులు, వారి పిల్లలకు పథకం అమ లు కోసం దరఖాస్తు చేసుకునేందుకు కార్మిక శాఖ కార్యాలయానికి వెళితే పోర్టల్ బంద్ అని సమాధానం వస్తోంది. ఇదిలా ఉండగా భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డు కాలపరిమితి ముగిసిన వారికి ఏదైనా ప్రమాదం జరిగితే కార్డు రెన్యూవల్ కాకపోవడంతో పరిహారం పొందే అవకాశాన్ని కూడా కోల్పోవలసి వస్తోంది. వేలాది మంది కార్మికులు వివిధ రకాల పథకాల కోసం దరఖాస్తు చేసుకొని పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. రెండు నెలలైనా పోర్టల్‌ను పునరుద్ధరించకపోవడంపై కార్మిక సంఘాల నాయకులు పెదవి విప్పకపోవడం గమనార్హం. కార్మికశాఖ నిధులను ఇతర అవసరాలకు వాడుకొని పోర్టల్‌ను కావాలనే నిలిపి వేశారనే అపవాదులు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికశాఖ పోర్టల్‌ను వెంటనే పునఃప్రారంభించడం ద్వారా తమకు పథకాలు తిరిగి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్ క్లియర్ అయితే సేవల పునరుద్దరణ

పోర్టల్ బంద్ అయిన కారణంగా సెప్టెంబరు 7 నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్కర్ రిజిస్ట్రేషన్ రెన్యూవల్స్ జరుగుతున్నాయి. క్లైమ్స్ మాత్రం అమలు కావడం లేదు. ఇన్ని రోజులు ఎన్‌ఐసీ (నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్) సాఫ్ట్‌వేర్‌లో నెలకొన్న సమస్యల వల్ల సేవలకు అంతరాయం కలిగింది. ఎన్‌ఐసీలో సాఫ్ట్‌వేర్ క్లియర్ అయ్యాక అన్ని సేవలు తిరిగి అందుబాటులోకి వస్తాయి. - ఎం సురేందర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్

క్రీడలతో సోదరభావం పెంపొందుతుంది





తాళ్ళపేట పాఠశాలలో ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఎంపిక పోటిలో జ్యోతిప్రజ్వాలన చేస్తున్న ఎంఈవో, పోటీలను ప్రారంభిస్తున్న రవికుమార్

దండేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సోదరభావం పెంపొందడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజులు అన్నారు. తాళ్ళపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14 జిల్లాస్థాయి బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల క్రీడా కారులను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహద పడుతాయన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 26 బాలుర జట్లు, 12 బాలికల జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ కన్వీనర్ సిరంగి సుదర్శన్, పీడీ రోజీ వరకు మారి, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, కాం గ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, మాజీ ఉపసర్పంచు పుట్టపాక తిరుపతి, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు రాజమౌళి, మురళీధర్, శ్రీనివాస్, విజయ లక్ష్మి, ప్రభావతి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



రాజ్‌కుమార్

తాండూర్, (ఆంధ్రజ్యోతి): అచ్చ లాపూర్‌లోని జెడ్పీ హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థి రాజ్‌కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీపీ సాంబమూర్తి బుధవారం తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు యాదాద్రి భువ నగిరి జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థి ని ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, సుధాకర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బేస్‌బాల్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్ స్టేడియంలో బుధవారం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బేస్ బాల్ ఎంపిక పోటీలను తెలంగాణ సాఫ్ట్‌బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రవికుమార్ ప్రారంభించారు. పోటీల కు 12 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొ న్నారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో నేపుణ్యాన్ని పెంపొందించేందుకు బెల్లంపల్లిలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. స్పోర్ట్స్ జెండాను ఎగురవేశారు.

మహాపాదయాత్ర పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతి రేకంగా దళితుల ఐక్యత కోసం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టే భద్రా చలం నుంచి హైద్రాబాద్ వరకు చేపట్టే మహాపాదయాత్ర పోస్టర్లను బుధవా రం నాయకులు విడుదల చేశారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శంకర్, లక్ష్మణ్, నర్సింగ్, కనకరాజు, శ్రీనివాస్, నర్సింగ్, శ్రీనివాస్, రామస్వామి, రామన్న, వెంకటేష్, తిరుపతి పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్టపనలో పాల్గొన్న భక్తులు

కన్నెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లి గ్రామంలో బుధవారం అభయాంజనేయస్వామి నవగ్రహ సహిత, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గోవర్ధనగిరి అనంతచార్యుల ఆధ్వర్యంలో ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతారాముల కళ్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు వెంటనే ఇవ్వాలి

బెల్లంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయకార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయానికి చెక్కులు వచ్చి 20 రోజులు అయినా అధికారులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వచ్చిన తర్వాతనే చెక్కులు ఇస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. రమేష్, నాయకురాల్లు దుర్గం లక్ష్మీ, రాధ, పద్మ, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ నాయకులు

అపరిశుభ్రతకు నిలయంగా జూనియర్ కళాశాల

● తరగతి గదులను ఆనుకుని పెరిగిన పిచ్చి మొక్కలు ● పాముల సంచారంతో భయపడుతున్న విద్యార్థులు



కళాశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు



కళాశాల ఆవరణలో ఉన్న కంకర కుప్పలు

మందమర్రిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అపరిశుభ్రతకు, పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. కళాశాల ఆవరణలో తరగతి గదులను ఆనుకుని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కళాశాల నిర్వాహకులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు తరగతి గదులకు వెళ్లాలంటే భయ పడుతున్నారు. కళాశాల బయట కూడా చెట్ల పొదలు ఉండడంతో పాముల సంచారం పెరిగిపోయింది. తరగతి గదుల్లోకి వస్తాయేమోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అలాగే చెత్తాచెదారం ఉండడంతో క్రిమి కీటకాలు వృద్ధి చెందుతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. కళాశాలలో గదుల నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆట స్థలంలో కూడా పిచ్చి మొక్కలు పెరిగాయి. కళాశాల మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో క్రీడలు ఆడలేకపోతున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైస్‌మిల్లు అక్రమాలపై విచారణ

తాండూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలోని రేచిని గ్రామంలో వాసవీ మాత మోడ్రన్ రైసుమిల్లుపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. రైసుమిల్లులోని రికార్డులను తనిఖీ చేశారు. బియ్యం అక్రమ తరలింపుపై ఆరా తీశారు. రెండు సంవత్సరాలుగా రూ.16 కోట్ల బియ్యాన్ని తప్పుదారి పట్టించినట్లు అధికారులు తెలిపారు. రైసుమిల్లు యజమాని అందుబాటులో లేకపోవడంతో తదుపరి నోటీసు అందజేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌లు తెలిపారు. సహకార సంఘం సొసైటీ అధికారులు పాల్గొన్నారు.



రైసుమిల్లు వద్ద విచారణ చేపడుతున్న అధికారులు

నష్టపరిహారం అందజేత



ఆవు యజమానికి నష్టపరిహారం అందిస్తున్న అధికారులు

కాసిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గురువాపూర్ చెందిన గోపికి చెందిన ఆవును మంగళవారం సాయంత్రం మద్దిమాడ అటవీ శివారు ప్రాంతంలో చిరుత పులి దాడి చేసి హతమార్చింది. బుధవారం అటవీ శాఖ అధికారులు రూ.8 వేల నష్టపరిహారం అందించారు. వన్య ప్రాణులకు హాని తలపెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కులగణనలో నేతకానిగా రాయించుకోవాలి

నెన్నెల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కులగణనలో నేతకాని కులస్థులు తమ కులం పేరును స్పష్టంగా నేతకానిగా రాయించుకోవాలని సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కామెర శ్రీనివాస్ అన్నారు. బుధవారం నెన్నెలలో విలేకరులతో మాట్లాడారు. గెజిట్ నంబరు 40లో నేతకానికి బదులు నేతాని అంటూ తప్పుగా ముద్రితమైందన్నారు. దాని ఆధారంగా సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయన్నారు. ఇప్పుడు మార్చుకోకపోతే నేతకాని కులం పేరు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీపతి మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం కొండపూర్ గ్రామానికి చెందిన శ్రీపతి మహేష్ ద్విచక్ర వాహనంపై వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో కొత్తపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ క్రమంలో మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేసిన డీసీపీ

తాండూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాండూర్ సర్కిల్ కార్యాలయం, మాదారం పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ భాస్కర్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రిసెప్షన్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, స్టేషన్ రైటర్, ప్రాసెస్ అప్లికేషన్‌ల ద్వారా తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైల్స్, రికార్డుల ను పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలన్నారు. గ్రామాల్లో గస్తీ పెంచాలని, డయల్ 100 ఫిర్యాదుకు వేగంగా స్పందించాలన్నారు. ఏసీపీ రవికుమార్, సీఐకుమారస్వామి, ఎస్‌ఐ సౌజన్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

భీమిని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భీమిని పోలీస్‌స్టేష న్‌ను బుధవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తనిఖీ చేశారు. ఏసీపీకి ఎస్‌ఐ విజయ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగ తం పలికారు. ఏసీపీ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డు లను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలు సుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగా హన కల్పించాలన్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

బెల్లంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 25వ వార్డులో బుధవారం రూ. 3 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ప్రారంభించారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పట్టణ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిదులు కేటాయిస్తుందన్నారు. కౌన్సిలర్ సుజాత, కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

బెల్లంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలోని దుర్గామాత దేవాలయం ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. పండితులు రవిశర్మ, గంగా కిశోర్ శర్మ,గట్టు సీతారాం శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, రుత్విక్ వరుణ, అఖండ దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నవగ్రహ వాస్తు హోమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలు చేస్తున్న వేద పండితులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 7 నవంబరు 2024



'గ్రాట్యుటీ' డబ్బుల కోసం ఎదురుచూపులు
- ప్రభుత్వాలు మారుతున్న తప్పని నిరీక్షణ
- దయనీయ స్థితిలో సర్‌సిల్క్ కార్మికులు

6



ఆకట్టుకుంటున్న 'ప్రకృతి మిత్ర'
- ఇంటి ఆవరణలో పలు రకాల పూల మొక్కలు
- మిద్దెపై కూరగాయల సాగు

7





సర్వర్ డౌన్..

- పథకాల అమలు కోసం ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో జిల్లాలోని 62వేల మంది కార్మికులు
- రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- భవన నిర్మాణ కార్మికుల వివరాలు నమోదులో ఆటంకం

మంచిర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణరంగ కార్మికులకు సంబంధించిన వివరాల నమోదు పోర్టల్ రెండు నెలల నుంచి నిలిచిపోయాయి. దీంతో వారికి అందాల్సిన పథకాలకు దూరం కావాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ సహాయ అధికారి పరిధిలో వివిధ రంగాలకు చెందిన 62,604 మంది కార్మికులు ఉన్నారు. కార్మికశాఖలో అసంఘటిత రంగ కార్మికులకంటే భవననిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులే అధికంగా నమోదై ఉన్నారు. భవన నిర్మాణ రంగంలో పునాదులు తీసే కూలీలు మొదలుకొని తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పెయిం టర్లు, టైల్స్, కార్పెంటర్, వెల్డింగ్, తదితర 36 రకాల పను లు చేసే కార్మికులు ఉన్నారు. వీరికి తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు ద్వారా పలురకాల సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కార్మికశాఖ ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించింది. ఆ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే రెండు నెలలుగా పోర్టల్ పనిచేయక పోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

కార్మికులకు అందించే పథకాలు....

రాష్ట్ర కార్మిక శాఖ నుంచి భవన ఇతర నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం ఆందించే పథకాలు అమలవుతున్నాయి. కార్మిక శాఖలో నమోదై ఉన్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.లక్ష పరిహారం అందజేస్తారు. ఆస్పత్రి ఖర్చులకు గరిష్ఠంగా నెలకు రూ. 4,500 చొప్పున అందిస్తారు. అంత్యక్రియలకు రూ.30 వేలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.4లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పరిహారం చెల్లిస్తారు. అలాగే మహిళా కార్మికులు ప్రసూతి అయితే రూ. 30వేల సహాయాన్ని అందజేస్తారు. కృత్రిమ అవయవాల కొనుగోలుకూ నిధులు మంజూరవుతాయి. ఇవే కాకుండా కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఉపకార వేతనం ఇస్తూ నైపుణ్య అభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. భవన నిర్మాణ కార్మికునిగా నమోదు కాని వ్యక్తి పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.50వేలు, అంగ వైకల్యానికి రూ.20వేలు పరిహారం చెల్లిస్తారు. ఇవేకాకుండా తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, ట్రస్ట్‌లలో పనిచేస్తూ కార్మిక సంక్షేమ నిధికి జమచేసే కార్మికులకు పథకాలను అమలు చేస్తున్నారు.

మూతపడ్డ పోర్టల్....

భవన నిర్మాణ కార్మికుల పథకాలన్నీ_చౌచిటీటీచ్బిజ్బ్బు ఇబ్బు.జౌరి.జీ పోర్టల్ ఆధారంగా...

మిగతా 7లో..

న్యూస్ బాక్స్

మందుబాబులకు పనిష్మెంట్

ఆసుపత్రిని శుభ్రం చేయాలంటూ శిక్ష

మంచిర్యాల అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27 మంది మందు బాబులకు వారం రోజులపాటు మాతా శిశు ఆసుపత్రిని శుభ్రం చేయాలంటూ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి ఉపనిషద్విని బుధవారం కమ్యూనిటీ సర్వీస్ శిక్షను విధించారు. మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 27 మందిని బుధవారం కోర్టులో హాజరు పర్చగా మాతా శిశు ఆసుపత్రిలో, ఆసుపత్రి ఆవరణను వారం రోజులపాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శుభ్రం చేయాలని న్యాయమూర్తి శిక్షను ఖరారు చేసినట్లు ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం నుంచి వారితో పనులు చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

108లో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూ

గర్మిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈఎంఆర్ఐ 108 సంస్థ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ ఉద్యోగాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని 108 ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక జిరాక్స్ సెట్‌తో మంచిర్యాలలోని 108 కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. 30 ఏండ్ల లోపు ఉండాలని, ఎంఎల్‌టీ డీఎం ఎల్‌టీ, జీఎఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి ఉండాలన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

బెల్లంపల్లిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 1, 3, 5 సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు గడువును ఈ నెల 11 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీపీ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమిషనరేట్‌లో సీనియర్ సిటిజన్స్‌కు సైబర్ నేరాలపై నిర్వహించిన సదస్సులో సీపీ అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సీపీ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉంటుందని, వారిని సులభంగా మోసం చేయవచ్చనే ఉద్దేశ్యంతో సైబర్ నేరగాళ్లు సీనియర్ సిటిజన్స్‌ను టార్గెట్ చేస్తున్నారన్నారు. రుణాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు తీసుకున్నా, వీడియోలతో బ్లాక్‌మేయిల్ చేసినా, జాబ్ ఫ్రమ్ హోమ్ అని ఆఫర్ చేసినా, ఇతర సైబర్ మోసాలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఏసీపీ ఎం.రమేష్, సీఐ ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో గడ్డం వినోద్ అబద్ధపు హామీలు ఇచ్చి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలను మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం 2వ వార్డులో 200 మందికి పైగా బీఆర్ఎస్ పార్టీలో చేరగా మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్నికల సమయంలో మెడికల్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్, బస్ డిపో ఏర్పాటు చేస్తానని ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడన్నారు. స్థానికంగా ఉంటానని చెప్పి అప్పుడప్పుడు వస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 9 పాలిటెక్నిక్ కళాశాలలు అప్‌గ్రేడ్ అయినా ఎమ్మెల్యే వినోద్ చేతకానితనంతో బెల్లంపల్లిలో అప్‌గ్రేడ్ కాలేదన్నారు. కూరగాయల మార్కెట్ భవనానికి అంబేద్కర్ పేరు, లేదా గుండా మల్లేష్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఎండీ ఆలీ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

కన్నెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కొత్త డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు, మండలాల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయ, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరి, పత్తి కొనుగోళ్లపై అవగాహన

చెన్నూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని రైతువేదికలో బుధవారం వరి, పత్తి కొనుగోళ్లపై రైతులకు అదనపు కలెక్టర్ మోతిలాల్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వరి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే కోయాలని సూచించారు. హార్వెస్టర్ స్పీడ్ 18 ఆర్‌పీఎం మెయింటెన్ చేయాలన్నారు. పొలం వద్దనే వడ్లను ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. పత్తిలో పాటించాల్సిన మెళకువల గురించి వివరించారు. జిల్లా సహకార సంఘం అధికారి సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఏడీఏ బానోత్ ప్రసాద్, తహసీల్దార్ మల్లికార్జున్, ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్,ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్

హాజీపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్ద న్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సన్న రకానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. మాజీ ఎంపీటీసీ బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్, ఆడెపు రమేష్, గోపు లింగయ్య, శంకర్ , మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అస్వస్థత

- ఆసుపత్రికి తరలింపు
- పరామర్శించిన కలెక్టర్



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



విద్యార్థినులను పరామర్శిస్తున్న కలెక్టర్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)కి తరలించారు. హాస్టల్‌లో రోజువారీలాగానే ఉదయం విద్యార్థినులకు కిచిడీ, చారు తయారు చేసి అందించారు. హాస్టల్‌లో 160 మంది విద్యార్థినులు కిచిడీ తిన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులు శ్రీలేఖ, శ్రీలత, నాగదేవత, లక్ష్మి, రుషిత, జ్యోతిలక్ష్మి, మౌనిక, సారిక, భూమిక, సింధూ, రాధిక, వైష్ణవిలు కడుపులో వికారంగా ఉందంటూ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు విద్యార్థినులు వాంతి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లితండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, 24 గంటలపాటు అబ్జర్వేషన్ తర్వాత వారిని డిశార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ లక్ష్మిరాజంను వివరణ కోరగా హాస్టల్‌లోని విద్యార్థినులతోపాటు తాముా కిచిడీ తిన్నామని, 12 మంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని, మిగతా వారెవరికి ఏంకాలేదన్నారు. సంఘటన జరిగిన అనంతరం హాస్టల్‌లో ఆరోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థినులను పరామర్శించిన కలెక్టర్

విద్యార్థినిల అస్వస్థత వార్త తెలుసుకున్న కలెక్టర్ కుమార్ దీపక్ ఏసీపీ ఆర్.ప్రకాష్, ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీధర్‌తో కలిసి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులతో తాగునీరు, ఆహారం నమూనాలను సేకరించి పరీక్షలు చేయించామని తెలిపారు. విద్యార్థినులు ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న పచ్చడిని తినడం వల్ల అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు.

విద్యార్థులు క్షేమంగా ఉన్నారు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాయికుంట గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని సాయికుంటలో గల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం డి.మాదవ్‌ను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో 12 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందడం, హెచ్‌ఎం ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లీవ్‌లో ఉండటం, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థుల అస్వస్థతలో రాజకీయాలు తగవు

- వారంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు
- మాజీ మంత్రి హరీష్‌రావు వైఖరి హాస్యాస్పదం
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థ తకు గురైన విషయంలో రాజకీయాలకు తావు లేదని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ట్విట్టర్‌లో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ చేసిన పోస్టును ఉద్దేశించి ప్రేంసాగర్‌రావు స్పందించారు. ఈ విష యమై షిర్డీలో ఉన్న ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ 12 మంది అస్వస్థతకు గురయ్యారని, వారిలో కేవలం ఒకరికే వాంతులు అయినట్లు తెలిపారు. మిగతా వారంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని, విద్యార్థినులకు అవసరమైన వైద్యంతోపాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడ్డ తరువాత హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్స్ చార్జీలు చెల్లించిదని గుర్తు చేశారు. మంచిర్యాల నియోజక వర్గంలో రూ.40 కోట్లతో హాస్టళ్లలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఐదారు సంవత్సరాల భవనాల కిరాయిలు కూడా చెల్లించలేదని ఆరోపించారు. ఆయన మంత్రిగాఉన్న సమయంలో మంచిర్యాలను ఏం పట్టించు కున్నా రని హరీష్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మంచిర్యాల పట్టణం నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అనాలోచిత నిర్ణయాల వల్ల నిర్మించిన ఎంసీహెచ్ భవనంలో వరద నీరు చేరి బాలింతలు, శిశువులు, గర్భిణిలు నానా అవస్థలు పడితే ఆరోగ్య, ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న హరీష్‌రావు ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మంచిర్యాలలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, హైద్రాబాద్‌లో ఉండి పోస్టిం గులు పెట్టడం కాకుండా ఇక్కడికి వచ్చి చర్చల్లో పాల్గొనాలని సవాలు విసిరారు.

● పాఠశాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

సాయికుంటలోని ఆశ్రమ పాఠశాలను డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని 12మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో వారిని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించామన్నారు. పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్లు శ్రీధర్, అనిత, అశోక్, సుమన్, సాయి, వెంకటేశ్వర్, గిరిజన సంక్షేమాధికారి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

లెదర్ పార్కు స్థలానికి హద్దులు పెట్టండి



సింగరేణి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మందమర్రి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాణహిత కాలనీ సమీపంలో గల లెదర్ పార్కు మధ్యలో నుంచి వేసిన రోడ్డును నిలిపివేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సింగరేణి అధికారులను ఆదేశించారు. బుధవారం లెదర్ పార్కును సందర్శించారు. సింగరేణి అధికారులు, కేకే 1 గ్రూపు ఏజెంట్ రాందాస్‌తో కలిసి పార్కు మ్యాప్‌ను పరిశీలించారు. సింగరేణి, రెవెన్యూ సంయుక్త సర్వే నిర్వహించి లెదర్ పార్కుకు కేటాయించిన 25 ఎకరాలకు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలను ప్రారంభించడానికి ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్ కుంభకోణాలపై విచారణ చేపట్టాలి

బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం చేసిన కుంభకోణాలపై విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. పలు వార్డుల్లో ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కుటుంబం అభివృద్ధిలో అందనంత స్థాయికి చేరుకుందన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ఫెల్యూర్ లీడర్ అని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం గెలవలేదన్నారు. కుటుంబ సర్వేపై ప్రతిపక్షాల విమర్శలు విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ఇంటింటి సర్వేతోనే సామాజిక వర్గాల చేయూత, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

లెదర్ పార్కు భూమి కాపాడాలి

మందమర్రిరూరల్ (ఆంధ్రజ్యోతి): లెదర్ పార్కు స్థలాన్ని కాపాడాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. సోలార్ పవర్ ప్లాంటు కాంట్రాక్టర్, మేనేజర్ లెదర్ పార్కు భూమిని ఆక్రమించారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంతో మాట్లాడి లెదర్ పార్కు ప్రారంభమయ్యేలా చూస్తానని తెలిపారు. రూ. 20 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో ప్రహరీ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుట నాయకుల వాగ్వాదం

జైపూర్ (ఆంధ్రజ్యోతి): ఇందారంలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఎదుటే మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం వాగ్వాదానికి దిగారు. డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసేందుకు ఎమ్మెల్యే, కలెక్టర్ కుమార్ దీపక్‌ల ఎదుటే నాయకులు దూషించుకున్నారు. కార్యక్రమం గురించి పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్ సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకుడు జక్కుల వెంకటేశం ఫిర్యాదు చేశారు. దీంతో ఫయాజ్ స్పందిస్తూ కార్యక్రమంపై ప్రతీ ఒక్కరికి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేశానని తెలిపారు. ఒకరికొకరు తోసుకోవడంతో సీఐ వేణుచందర్ ఇరువర్గాలను సముదాయించారు. అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలో మరో కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నా వెళ్లిపోయారు. నర్వ గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ పనులకు కలెక్టర్‌తో కలిసి భూమి పూజ చేశారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

భీమారం (ఆంధ్రజ్యోతి): సుంకరిపల్లి గ్రామానికి చెందిన సెగ్యం లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి రూ.1.75 లక్షల ఎల్‌వోసీని బాధితురాలు ఇంటికి వెళ్లి ఎల్‌వోసీని అందజేశారు.



ఇందారంలో డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్